PRGI No: TGBIL/25/A0946

# విశాలజ్యోతి

సమగ్ర తెలుగు దినపత్రిక

approved by Govt of INDIA, TELANGANA
DK MEDIA
OUR SERVICES
* NEWS PAPER * NEWS CHANNEL * DK GRAPHICS
* DK ADS & PROMOTIONS * DK PRINTERS * DK PUBLICATIONS
WE'RE HIRING REPORTERS
for more details 9440711117, www.vishalajyothi.com

వరంగల్ సంపుటి : 02 సంచిక : 28 బుధవారం, ఆగస్టు 26 2026 , పేజీలు - 4 వెల : 5 రూ/-

## డిజిటల్ పేమెంట్ జర్నీలో యూపీఐ

# టర్నింగ్ పాయింట్?



**న్యూ ఢిల్లీ** దశాబ్దం క్రితం ప్రారంభమైన యూపీఐ దేశ డిజిటల్ చెల్లింపుల ప్రయాణంలో ఓ చారిత్రక మైలురాయని ప్రధాని నరేంద్ర మోదీ అభివర్ణించారు. 2016 ఆగస్టు 25న ప్రారంభమైన యూపీఐ నేడు దేశ డిజిటల్ ఆర్థిక వ్యవస్థకు, ఆర్థిక సమ్మిళిత సాధనకు వెన్నెముకగా నిలిచిందని మోదీ వెల్లడించారు. యూనిఫైడ్ పేమెంట్స్ ఇంటర్‌ఫేస్ (యూపీఐ) ప్రారంభమై పదేళ్లు పూర్తయిన సందర్భంగా విస్తృతి, ప్రజల్లోకి చేరిన తీరు ప్రతి భారతీయుడు గర్వపడే అంశమని పేర్కొన్నారు. పదేళ్ల క్రితం యూపీఐ ప్రారంభం కావడం దేశ డిజిటల్ చెల్లింపుల ప్రయాణంలో కీలక మలుపుగా నిలిచిందని 'ఎక్స్' వేదికగా చేసిన పోస్టులో తెలిపారు. యూపీఐని ఉపయోగించడం ద్వారా తమకు ఎదురైన అనుభవాలను పంచుకోవాలని, ఇది తమ రోజువారీ జీవితాలను ఎలా మార్చిందో వివరించాలని ప్రజలను ప్రధాని కోరారు. పదేళ్లలో భారీ వృద్ధినేషనల్ పేమెంట్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎన్‌పీసీఐ) అభివృద్ధి చేసిన యూపీఐ ప్రస్తుతం దేశ డిజిటల్ చెల్లింపుల వ్యవస్థలో కీలక భాగంగా మారింది. ప్రారంభమైన సమయంలో పరిమిత స్థాయిలో ఉన్న ఈ సేవ, ఇప్పుడు దేశంలోని కోట్లాది మంది రోజువారీ లావాదేవీలకు ప్రధాన సాధనంగా మారింది. గత పదేళ్లలో యూపీఐ లావాదేవీల సంఖ్య, వాటి విలువ రెండింటిలోనూ భారీగా వృద్ధి నమోదైంది. కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ గణాంకాల ప్రకారం, 2016-17 ఆర్థిక సంవత్సరంలో యూపీఐ ద్వారా 1.78 కోట్ల లావాదేవీలు మాత్రమే జరిగాయి. 2025-26 నాటికి ఆ సంఖ్య 24,162 కోట్లకు పైగా పెరిగింది. అంటే కేవలం పదేళ్లలో లావాదేవీల సంఖ్య దాదాపు 13 వేల రెట్లు పెరిగింది. అదే సమయంలో లావాదేవీల మొత్తం విలువ కూడా అనూహ్యంగా పెరిగింది. 2016-17లో రూ.0.07 లక్షల కోట్లుగా ఉన్న లావాదేవీల విలువ, 2025-26 నాటికి సుమారు రూ.314 లక్షల కోట్లకు చేరుకుంది. ఇది 4 వేల రెట్లకు పైగా పెరుగుదల అని చెప్పింది

## హైదరాబాద్ క్యూర్ పరిధిలో ఎల్ఐజీ ఇందిరమ్మ ఇళ్ల డ్రా తేదీలు ఖరారు



**హైదరాబాద్** క్యూర్ పరిధిలో ఎల్ఐజీ ఇందిరమ్మ ఇళ్లకు 40,900 మంది అర్హులను గుర్తించినట్లు రాష్ట్ర హౌసింగ్ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి వెల్లడించారు. ఈ నెల 27 నుంచి నాలుగు రోజుల పాటు లాటరీ ద్వారా ఇళ్లు కేటాయించనున్నట్లు చెప్పారు. ఇళ్లు రాని వారికి రూ.10 వేలు తిరిగి ఇస్తామని మంత్రి తెలిపారు. టవర్ల నిర్మాణానికి టెండర్ల ప్రక్రియ పూర్తయిందని వెల్లడించారు. ఎల్బీనగర్, గోషామహల్, నాంపల్లి, ముషీరాబాద్ నియోజకవర్గాల్లో ఇందిరమ్మ టవర్ల కోసం సెప్టెంబరు 3 వరకు దరఖాస్తు చేసుకోవాలని పొంగులేటి శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. ఇందిరమ్మ టవర్ల నిర్మాణం, దరఖాస్తులు, లాటరీ ప్రక్రియపై సచివాలయంలో పొంగులేటి శ్రీనివాసరెడ్డి సమీక్ష నిర్వహించారు. క్యూర్‌లోని 16 నియోజకవర్గాల్లో రూ.807 కోట్ల 40 లక్షలతో నిర్మించనున్న ఇందిరమ్మ టవర్ల కోసం 60,720 మంది దరఖాస్తు చేశారు. అనర్హులుగా తేలినట్లు మంత్రి తెలిపారు.

## మూసీ ప్రాజెక్ట్ భూసేకరణను

# వేగవంతం చేయండి.




**హైదరాబాద్, ఆగస్టు 25:** మూసీ ప్రాజెక్ట్‌పై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సమీక్ష నిర్వహించారు. మూసీ ప్రాజెక్ట్ కోసం భూ సేకరణను వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. ల్యాండ్ పూలింగ్‌పైన స్పష్టమైన విధానం రూపొందించుకోవాలన్నారు. ఎఫ్టీఎల్, బఫర్ జోన్, అసైన్డ్ భూముల సేకరణ కోసం స్పష్టమైన విధానం తయారు చేసుకోవాలని సూచించారు. న్యాయపరమైన చిక్కులు రాకుండా చూడాలన్నారు. మూసీ ప్రాజెక్టు ఫేజ్ 2కి వీలైనంత త్వరగా టెండర్లను పిలవాలని ఆదేశించారు.ప్రాజెక్టుల ు అతి తక్కువ వడ్డీకి వచ్చే రుణాలపైన మునిసిపల్ కమిషనర్‌లు దృష్టి సారించాలని సీఎం తెలిపారు. టీడీఆర్‌పై ప్రతి వారం సమీక్ష జరగాలని చెప్పారు. మంచిరేవుల ఓంకారేశ్వం స్వామి ఆలయం టెండర్లు తక్షణం పిలవాలని ఆదేశించారు. కొత్వాల్ గూడా బర్డ్స్ పార్క్‌కు మరింత ప్రచారం కల్పించాలని అధికారులకు సీఎం రేవంత్ రెడ్డి సూచనలు చేశారు. (మంగళవారం) బోధి పెవిలియన్‌లో జరిగిన ఈ సమీక్షా సమావేశానికి సీఎం కార్యదర్శి మాణిక్ రాజ్, ఎవీణూ కమిషనర్ సర్ఫరాజ్ అహ్మద్, +ఎవీజ కమిషనర్ ఆర్.వి.కర్ణన్, మల్కాజ్‌గిరి మున్సిపల్ కమిషనర్ వినయ్ కృష్ణా రెడ్డి, సైబరాబాద్ కమిషనర్ సృజన, రంగారెడ్డి జిల్లా కలెక్టర్ నారాయణ రెడ్డి, మేడ్చల్ కలెక్టర్ మను చౌదరి, ఎంఆర్డీసీఎల్ ఎండీ ఈ.వి. నరసింహా రెడ్డి, ఎంఆర్డీసీఎల్ జేఎండీ గౌతమి, ఇతర ఉన్నతాధికారులు

# ఆ వ్యక్తి భారత్ వ్యతిరేకి!

## - రేవంత్‌రెడ్డి అమెరికా పర్యటన అనుమతులపై కిషన్‌రెడ్డి కీలక వ్యాఖ్యలు



**హైదరాబాద్ :**రేవంత్‌రెడ్డి అమెరికా పర్యటనకు కేంద్రం అనుమతి నిరాకరించడం, ఈ అంశంపై హైద రాబాద్‌లో సోమవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో కేంద్ర ప్రభుత్వంపై సీఎం వ్యాఖ్యలపై కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి స్పందించారు. ఇలాంటి విషయాల్లో రాజకీయ పరమైన వ్యాఖ్యలు చేయడం, రాజకీయాలు ఆపాదించడం సరికాదన్నారు.అర్హతలేని వ్యక్తులను కలవాలనుకున్నారు : అమెరికా పర్యటనపై సీఎం చేసిన వ్యాఖ్యలు అర్థరహితమని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి అన్నారు. రేవంత్‌రెడ్డిని కేంద్రం అడ్డుకుందని అనటం సరికాదన్నారు. కేంద్రం అనుమతి రాకుండానే ఆదరాబాదరాగా ముఖ్యమంత్రి పర్యటన పెట్టుకున్నారని, అమెరికా పర్యటనలో అర్హతలేని వ్యక్తులను కలవాలని రేవంత్‌రెడ్డి నిర్ణయించుకున్నారని కిషన్‌రెడ్డి ఆరోపించారు.రేవంత్‌రెడ్డి స్పష్టమైన వివరణ ఇవ్వలేదు : రేవంత్‌రెడ్డి గతంలో అమెరికా, లండన్, ఇతర దేశాల పర్యటనలకు కేంద్రం అనుమతి ఇచ్చిందని కిషన్?రెడ్డి గుర్తుచేశారు. ఈసారి స్పష్టమైన కారణాల వల్లే విదేశాంగశాఖ అనుమతి ఇవ్వలేదని స్పష్టం చేశారు. సీఎం స్థాయిలో ఉన్న వ్యక్తి బాధ్యతాయుతంగా వ్యవహరించాలని, తన పర్యటనపై రేవంత్‌రెడ్డి స్పష్టమైన వివరణ ఇవ్వలేదన్నారు.

## దీక్ష విరమించినా ఫీజు రీయింబర్స్‌మెంట్‌పై


# పోరాటం కొనసాగుతుంది

- 'ఫీజుల బకాయి - బీజేపీ లడాయి' పేరుతో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్‌రావు దీక్ష
- రామచందర్‌రావుతో దీక్ష విరమింపజేసిన బీజేపీ నేత లక్ష్మణ్
- నిన్నటి నుంచి ఈరోజు వరకు దీక్ష

**హైదరాబాద్ :**

ఫీజు రీయింబర్ మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ 'ఫీజుల బకాయి - బీజేపీ లడాయి' పేరుతో రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్‌రావు చేపట్టిన దీక్ష ముగిసింది. రామచందర్‌రావుకు నిమ్మరసం ఇచ్చి బీజేపీ నేత లక్ష్మణ్ దీక్ష విరమింపజేశారు. నిన్న ఉదయం 11 నుంచి ఈరోజు మధ్యాహ్నం 2 వరకు దీక్షలో పాల్గొన్నారు. దీక్ష విరమణకు వైద్యులు ఆయనను పరీక్షించినప్పుడు బీపీ 90/60కి పడిపోయింది. దీక్ష విరమించినా ఫీజు రీయింబర్‌మెంట్‌పై బీజేపీ పోరాటం కొనసాగుతుందని ఆయన ప్రకటించారు.

బీజేపీ పోరు ఆగదు : దీక్షా శిబిరంలో పాల్గొన్న బీజేపీ నేతలు తెలంగాణ ప్రభుత్వంపై విరుచుకుపడ్డారు. సీఎం రేవంత్ ఇక్కడ విద్యార్థులు, టీచర్లను పట్టించుకోలేదు కానీ విదేశీ విద్యాసంస్థలు తీసుకొస్తా అంటున్నారని ఎంపీ లక్ష్మణ్ విమర్శించారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేసే వరకు బీజేపీ పోరు ఆగదని స్పష్టం చేశారు. దేశ ప్రజలను సీఎం రేవంత్ తప్పుదోవ పట్టిస్తున్నారని లక్ష్మణ్ విమర్శించారు. గతంలో చాలా సీఎంలకు పొలిటికల్ క్లియరెన్స్ ఇవ్వలేదని, మీ యూపీఏ ప్రభుత్వం మీ కాంగ్రెస్ సీఎంలకి ఇవ్వలేదని గుర్తు చేశారు. తెలంగాణ సెంటిమెంట్?తో రెచ్చగొట్టాలని చూస్తే ప్రజలు ఊరుకోరని హెచ్చరించారు. రాహుల్ గాంధీ అశోక్ నగర్ వచ్చి మరీ యువతను మోసం చేశారని ఆయన ఆరోపించారు. ఇప్పుడు



తెలంగాణకు రాకుండా రాహుల్ గాంధీ తప్పించుకు తిరుగుతున్నారని, 'అమ్మకు అన్నం పెట్టనోడు పిన్నమ్మకు బంగారు గాజులు తొడుగుతా అన్నారట' అని లక్ష్మణ్ ఎద్దేవా చేశారు.

# ప్రభుత్వం తప్పు చేస్తే.. ప్రజలు ఎందుకు శిక్ష అనుభవించాలి?:



**హైదరాబాద్, ఆగస్టు 25 :**మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి లక్ష్యంగా బీఆర్ఎస్ నేత, మాజీ మంత్రి హరీశ్ రావు తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. కుత్బుల్లాపూర్ లో నిర్వహించిన 22ఏ (22ఎ) బాధితుల సమావేశానికి స్థానిక ఎమ్మెల్యే వివేకానందతో కలిసి ఆయన హాజంయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... తప్పు చేసింది ప్రభుత్వమైతే, కార్యాలయాల చు ట్టూ తిరుగుతూ ప్రజలు ఎందుకు శిక్ష అను భవించాలని ప్రశ్నించారు. వందలాది కాలనీల అధ్యక్షులు, వేలాది మంది బాధితులు తమ భూ ములను నిషేధిత 22ఏ జాబితాలో పెట్టా రంటూ ఆవేదనతో ఇక్కడికి వచ్చారని హరీశ్ రావు పేర్కొన్నారు. "భూములను 22ఏలో పెట్టడం మీ వంతు.. మళ్లీ వాటిని తొలగిం చుకోవడానికి దరఖాస్తులు పట్టుకుని ఆఫీసుల చుట్టూ తిరగడం ప్రజల వంతా?" అని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డిని సూటిగా నిలదీశారు. ప్రభుత్వం చేసిన తప్పును వెంటనే సవరించాల్సిన బాధ్యత మంత్రిపైనే ఉందన్నా రు. లక్షలాది మంది ఆస్తులను రాత్రికి రాత్రి 22ఏ జాబితాలో చేర్చి, ప్రజలకు కంటిమీద కునుకు లేకుండా చేశారని మండిపడ్డారు. 30 శాతం కమీషన్ల దురాశతోనే ఈ భూములన్నింటినీ 22ఏలో పెట్టారంటూ హరీశ్ రావు ఆరోపించారు. మంత్రి అత్యాశ ఏదో ఒకరోజు ఆయన దుఃఖానికి కారణమవుతుందని హెచ్చరించారు. ప్రభుత్వ కుట్రల వల్ల లక్షలాది మంది జీవితాలు నాశనమవుతున్నాయని. పిల్లల పెళ్లిళ్లు ఆగిపోతున్నాయని, దవాఖాన ఖర్చుల కోసం ఆస్తులను బ్యాంకుల్లో కుదువ పెడదామంటే బ్యాంకులు సైతం తీసుకోవడం ఆందోళన వ్యక్తం చేశారు.

## వన మహోత్సవం లక్ష్యాలను

# నిర్ణీత గడువులో పూర్తి చేయాలి



**హైదరాబాద్, ఆగస్టు 25 :** రాష్ట్ర వ్యాప్తంగా వన మహోత్సవాన్ని విజయవంతం చేయాలని మంత్రి సీతక్క సంబంధిత అధికారులను ఆదేశించారు. వన మహోత్సవం లక్ష్యాలను నిర్ణీత గడువులో పూర్తి చేయాలని దిశానిర్దేశం చేశారు. రాష్ట్ర సచివాలయంలో గ్రామీణ అభివృద్ధి శాఖపై మంత్రి సీతక్క వీడియో కాన్ఫ రెన్స్ ద్వారా సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమీక్షలో కమిషనర్ దివ్య, స్పెషల్ కమిషనర్ శ్రీలక్ష్మి, జిల్లా సీఈవోలు, డీఆర్డీవోలు, డీపీవో, అడిషనల్ డీఆర్డీవోలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా అధికారులకు పలు కీలక అంశాలపై మంత్రి సీతక్క దిశానిర్దేశం చేశారు. ఉపాధి హామీ పనులు, పంట కుంటల నిర్మాణం, మహిళా సంఘ భవనాల నిర్మాణం, నూతన చేయూత పెన్షన్ల మంజూరుపై సమీక్షించారు. ఇప్పటివరకు ఇచ్చిన టార్గెట్‌లో 86శాతం మొక్కలు నాటామని తెలిపారు. 6.18 కోట్ల మొక్కలు నాటి లక్ష్యాన్ని నిర్దేశించుకుని 5.32 కోట్ల మొక్కలను నాటినట్లు వెల్లడించారు.నాటిన మొక్కలకు క్రమం తప్పకుండా నీటిని అందించాలని సూచించారు. ప్రజాప్రతినిధులు, మహిళా సంఘాలు, విద్యార్థులు, యువతను భాగస్వాములను చేయాలని దిశానిర్దేశం చేశారు. మొక్కలకు రక్షణ కంచెలు తప్పనిసరిగా ఏర్పాటు చేయాలని తెలిపారు. అవెన్యూ ప్లాంటేషన్లలో ఫెన్సింగ్ పటిష్ఠంగా ఉండేలా చూడాలని అన్నారు. ప్రతి గ్రామ పంచాయతీలో రోజుకు కనీసం 60 మంది కూలీలకు ఉపాధి కల్పించాలని తెలిపారు

## నషా ముక్త్ సమాజ నిర్మాణంలో

# యువత పాత్ర కీలకం



**నిజామాబాద్, ఆగస్టు 25:** నషా ముక్త్ సమాజ నిర్మాణంలో యువత పాత్ర కీలకమని తెలంగాణ గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా వ్యాఖ్యానించారు. యువత మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండి, విద్యా క్రీడా రంగాల్లో రాణించాలని సూచించారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ నేతృత్వంలో నషా ముక్త్ భారత్ అభియాన్ ప్రజా ఉద్యమంగా రూపుదిద్దుకుంటుందని పేర్కొన్నారు. నిజామాబాద్ జిల్లాలో నషా ముక్త్ భారత్ అభియాన్‌పై విద్యార్థులతో ముఖాముఖి నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా, ఎంపీ అర్వింద్, ఎమ్మెల్యేలు సూర్యనారాయణ, రాకేశ్ రెడ్డి, జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా, పోలీసు కమిషనర్ సాయి చైతన్య పాల్గొన్నారు. ఈ సందర్భంగా గవర్నర్ మాట్లాడారు. పిల్లల ప్రవర్తనను తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు. ప్రతి ఒక్కరూ భాగస్వామ్యం కావాలని గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా పిలుపునిచ్చారు.

PRGI No: TGBIL/25/A0046
విశాలజ్యోతి
సమగ్ర తెలుగు దినపత్రిక



# ఆర్టీసీ కష్టజీవులతో చెలగాటం వద్దు

- సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి భూక్య రమేష్
- సమస్యల సాధన కోసం ప్రారంభమైన నిరసన దీక్ష శిబిరం

**భద్రాద్రి కొత్తగూడెం(విశాల జ్యోతి):** ఆర్టీసీ కార్మికుల జీవితాలతో చెలగాటమాడుతున్న కాంగ్రెస్ ప్రభుత్వ వైఖరి మార్చుకోవాలని సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి భూక్య రమేష్ హెచ్చరించారు. పెంచిన భారాన్ని తగ్గించాలని ఉద్యోగ భద్రత కల్పించి ప్రభుత్వం అంగీకరించిన అంశాలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఆర్టీసీ కార్మికుల సమస్యలను పరిష్కరించ డంతో పాటు వారి సంక్షేమానికి అధిక ప్రాధాన్యత ఇస్తూ ప్రత్యేక బడ్జెట్ను కేటాయించాలని కోరుతూ కొత్తగూడెం డిపో నందు మంగళవారం స్టాఫ్ వర్కర్స్ ఫెడరేషన్ (ఎస్ డబ్ల్యూ ఎఫ్) సిఐటియు ఆధ్వర్యంలో నిరాహార దీక్ష శిబిరాన్ని చేపట్టారు. ఈ దీక్ష శిబిరాన్ని సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి భూక్య రమేష్ ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఆర్టీసీ పరిరక్షణ కోసం ఎస్డబ్ల్యుఎఫ్ సిఐటియు ఆధ్వర్యంలో అనేక సంవత్సరాల నుండి దశల వారి ఉద్యమాలు చేపట్టడం వల్ల కనీస స్థాయిలో ఆర్టీసీ సంస్థను రక్షించుకోవడం జరుగుతుందన్నారు. రోజురోజుకు సమస్యలు పెరిగిపోతూ ఆర్టీసీ కార్మికుల జీవితాలతో చెలగాటమాడుతున్న కాంగ్రెస్ ప్రభుత్వ వైఖరి మార్చుకోవాలని హెచ్చరించారు. ఈ సంవత్సర కాలంలో సమ్మె చేయాలని ఆర్టీసీ జేఏసీ నాయకత్వంలో పలుమార్లు సమ్మె నోటీసు ఇచ్చినప్పటికీ ఏమాత్రం కార్మికుల పట్ల ప్రేమ లేకుండా తన ఇష్టానుసారం వచ్చినట్లు చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వ వైఖరి నిరసనగా ఆర్టీసీ సంఘాల నాయకత్వంలో సమ్మెకు సిద్ధమవడం జరిగిందన్నారు. 17 రకాల అంశాలతో సమ్మె నోటీసు ఇచ్చినప్పటికీ ప్రభుత్వం తరపున సమస్యలు పరిష్కరిస్తామని హామీ ఇచ్చి నెల రోజులు గడుస్తున్నా ఏ ఒక్క హామీ కూడా నెరవేర్చకుండా కాలయాపన చేస్తున్న రాష్ట్ర ప్రభుత్వ మొండి వైఖరికి నిరసనగా కార్మికులు ఐక్యంగా ఉద్యమించాలన్నారు. పే స్కేలు ఏరియర్స్ ఉద్యోగ భద్రత రిక్రూట్మెంట్ ప్రమోషన్స్ తదితర డిమాండ్ల సాధన కోసం కనీస అవసరాలు తీర్చాలని కార్మికుల కోరుతున్నప్పటికీ పాలకవర్గం ఆర్టిసి యాజమాన్యం చేస్తున్న నిర్లక్ష్య పద్ధతికి వ్యతిరేకంగా ఐక్య ఉద్యమాలు చేయాలన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం ఆర్టీసీలో కార్మిక సంఘాలు లేవని సమస్యలు అంతకంటే లేవని సంఘం పెట్టి ధర్నా చేస్తే ఉద్యోగం నుండి తొలగిస్తామని హెచ్చరించినా గత బీఆర్ఎస్ ప్రభుత్వనీకి కార్మికులు తగిన గుణపాఠం చెప్పి గద్దె దింపిన చరిత్రను గుర్తుంచుకోవాలని కాంగ్రెస్ ప్రభుత్వానికి హెచ్చరించారు. అధికారంలోకి వస్తే ఆర్టీసీ కార్మికుల సమస్యలను పరిష్కరిస్తామని ప్రభుత్వంలో విలీనం చేస్తామని ఏరియర్స్ పే స్కేలు అన్ని అమలు చేస్తామని రిక్రూట్మెంట్ కూడా చేస్తామని చెప్పి అధికారంలో వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం గద్దనెక్కి మాటలు మార్చి కార్మికుల మోసం చేయడం కార్మిక వర్గం చూస్తూ ఊరుకోదని ఆయన హెచ్చరించారు. తక్షణమే ఎస్ డబ్ల్యూ ఎఫ్ సిఐటియు కార్మికవర్గ సంక్షేమం కోసం పెట్టిన డిమాండ్లను ప్రభుత్వం వెంటనే చర్చించి సమస్యలు పరిష్కరించాలని ఆయన డిమాండ్ చేశారు. లేదంటే ఐక్య ఉద్యమాలను ఉధృతం చేసి పోరాటాలను కొనసాగిస్తామన్నారు.

సిపిఎం సంఘీభావం...ఆర్టీసీ పరిరక్షణ కోసం చేస్తున్న పోరాటానికి సిపిఎం సంఘీభావం తెలిపింది. సిపిఎం 21వ డివిజన్ కార్పొరేటర్ చింతలపూడి శ్రావణి మాట్లాడుతూ ఎస్డబ్ల్యుఎఫ్ చేస్తున్న పోరాటానికి సిపిఎం పార్టీ సంపూర్ణ మద్దతు తెలియజేస్తుందని అన్నారు. కార్మిక వర్గానికి అన్ని విధాలుగా నష్టం చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం వైఖరి పట్ల కార్మికులు తీవ్ర అసంతృప్తితో ఉన్నారని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. ఆర్టీసీ పరిరక్షణ కోసం చేస్తున్న పోరాటానికి సిపిఎం పార్టీ సంపూర్ణ సంఘీభావం తెలుపుతుందన్నారు. భవిష్యత్తు పోరాటాలకు సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో పరోక్షంగా ప్రత్యక్షంగా పాల్గొంటామని తెలిపారు. డిపో అధ్యక్షులు బత్తుల నాగేశ్వరావు మాట్లాడుతూ అంగీకరించిన అంశాలను కూడా ఆర్టీసీ మేనేజ్మెంట్ ఆటంకం కలిగిస్తుందన్నారు. తక్షణమే ఆ అంశాలను అమలు చేయాలన్నారు. డిపో కార్యదర్శి ఇసనపల్లి శామ్యూల్ మాట్లాడుతూ సంపూర్ణ ఐక్యతతో సమ్మె చేసి ఏడు సంవత్సరాల తర్వాత ప్రభుత్వ చొరవతో యాజమాన్యం చర్చలు నిర్వహించి అంగీకరించిన అంశాలు కూడా అమలు చేయడంలో ఆలస్యం చేస్తున్నారని అన్నారు. అంగీకరించిన అంశాలు కార్మిక సంఘాలతో చర్చించి పెంచిన పనిభారాలు తగ్గించి ఉద్యో గ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. కార్మికులు ఎస్ కే రఫీ, ఇసనపల్లి యాకోబు, పి.రామకృష్ణ, బి.రామకృష్ణ, పి.శ్రీనివా స్,పి.బాబు, ధనరాజ్, ఇర్షా ఆలీ, రామ్ మూర్తి, లోకరక్షకుడు, కేశవరావు, మహిళ ఎస్డబ్ల్యుఎఫ్ నాయకులు మోహిని, కరుణ, సబిత దీక్ష శిబిరన్ని సందర్శించి సంఘీభావం తెలిపారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా సహాయక కార్యదర్శి లిక్కిం బాలరాజ్, సింగరేణి కాలరీస్ ఎంప్లాయిస్ యూనియన్ బ్రాంచ్ నాయకులు గడల నరసింహారావు, కొత్తపల్లి రమేష్ బాబు, సిఐటియు నాయకులు బాల కృష్ణ నసూర్, ప్రముఖ ఐలు జిల్లా నాయ కులు న్యాయవాదులు కే.పుల్లయ్య, శ్రీనివాస్ ఐద్వా పట్టణ కార్యదర్శి ఎస్ లక్ష్మి, నాగదుర్గ తదితరులు పాల్గొన్నారు.



# మండల్ కమీషన్ సిఫారసులు అమలు చేయరా



- బిసి జాక్ రాష్ట్ర చైర్మన్ డాక్టర్ తిరునహరి శేషు

**హనుమకొండ విశాలజ్యోతి:** దేశంలో 80 కోట్లకు పైగా ఉన్న వెనుకబడిన తరగతుల అభివృద్ధి, సామాజిక న్యాయం కోసం మండల్ కమీషన్ సిఫారసులను పూరి స్థాయిలో అమలు చేయాలని బిసి జాక్ రాష్ట్ర చైర్మన్ డాక్టర్ తిరునహరి శేషు అభిప్రాయపడినారు. బిపి మండల్ 109వ జయంతి కార్యక్రమాన్ని పురస్కరించుకొని యూనివర్సిటీ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో జరిగిన కార్యక్రమంలో పాల్గొన్న డాక్టర్ శేషు మాట్లాడుతూ దేశంలోని వెనుకబడిన తరగతుల అభివృద్ధి కోసం 40 సిఫారసులతో 1980లో మండల్ తన కమీషన్ రిపోర్ట్ ని కేంద్ర ప్రభుత్వానికి అందజేస్తే కేంద్రంలో ఏ పార్టీ అధికారంలో ఉన్నా జాతీయ స్థాయిలో విద్యా ఉద్యోగాలలో 27 శాతం రిజర్వేషన్లు తప్ప ఏ ఒక్క సిఫారసుని అమలు చేయటానికి ఏ ప్రభుత్వం ముందుకు రాలేదని విమర్శించారు. జన గణనలో భాగంగా జాతి ఆదారిత గణన కూడా చేపట్టాలని నాలుగు దశాబ్దాల క్రితమే మండల్ తన నివేదికలో సిఫారసు చేసినా కాంగ్రెస్ బిజెపి ప్రభుత్వాలు కులగణన చేపట్టకుండా బలహీనవర్గాలకి అన్యాయం చేశాయని విమర్శించారు. మండల్ కమీషన్ సిఫారసుల మేరకు కేంద్ర ప్రభుత్వ విద్యా ఉద్యోగాలలో ఓబీసీలకు ఇచ్చిన 27 శాతం రిజర్వేషన్లని కూడా ప్రభుత్వాలు పూర్తిగా అమలు చేయడంలో వైఫల్యం చెందాయని అభిప్రాయపడినారు. హన్మకొండ జిల్లా అధికారులు అనుమతి ఇచ్చిన తర్వాత కాకతీయ విశ్వవిద్యాలయం క్రాస్ రోడ్ లో మండల్ విగ్రహాన్ని ఏర్పాటు చేస్తామని తెలియజేసినారు.

ఈ కార్యక్రమంలో డాక్టర్ ఆదిరెడ్డి డాక్టర్ పుల్లా రమేష్ డాక్టర్ మంథని శంకర్ డాక్టర్ సదానందం డాక్టర్ కళ్యాణి డాక్టర్ హరి కుమార్ డాక్టర్ రంజిత్ డాక్టర్ నవీన్ డాక్టర్ ఓ. నవీన్ తదితరులు పాల్గొన్నారు.

# పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలి

- రాష్ట్ర అటవీ, పర్యావరణ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ



**వరంగల్ జిల్లా, విశాలజ్యోతి:** పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరు మొక్కలు నాటలని, నాటిన ప్రతి మొక్కను రక్షించాలాని, ఇందుకుప్రతి ఒక్కరూ భాగస్వాములు అవ్వాలని రాష్ట్ర అటవీ, పర్యావరణ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ పిలుపునిచ్చారు. ప్రతి ఇంటా మొక్కలు నాటి పెంచడంతో పాటు వాటిని సంరక్షించే బాధ్యతను ప్రతి ఒక్కరూ తీసుకోవాలని ఆమె అన్నారు. వరంగల్ నగరంలోని రంగశాయిపేట ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రాంగణంలో మంగళవారం జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద అధ్యక్షతన నిర్వహించిన వన మహోత్సవ కార్యక్రమానికి రాష్ట్ర అటవీ, దేవాదాయ, పర్యావరణ శాఖ మంత్రి వర్యులు కొండా సురేఖ ముఖ్య అతిథిగా పాల్గొని కళాశాల ప్రాంగణంలో మొక్కలు నాటారు. అనంతరం కళాశాల ప్రాంగణంలో ఏర్పాటు చేసిన నూతన ఓపెన్ జిమ్ను ప్రారంభించి, వివిధ శాఖలు ఏర్పాటు చేసిన స్టాళ్లను సందర్శించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఎల్నినో ప్రభావం కారణంగా వన మహోత్సవ కార్యక్రమం కొంత ఆలస్యమైందన్నారు. ఒక్క రోజులోనే 10 శాతం మొక్కలు నాటేలా లక్ష్యాన్ని నిర్దేశించుకున్నట్లు తెలిపారు. ప్రతి ఇంటిలో, ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో, ప్రభుత్వ కార్యాలయాల్లో విస్తృతంగా మొక్కలు నాటాలని సూచించారు. సకాలంలో వర్షాలు కురవకపోవడానికి సరైన వృక్ష సంపద లేకపోవడం కూడా ఒక ప్రధాన కారణమని మంత్రి పేర్కొన్నారు. వృక్షాలు మానవ మనుగడకు ఎంతో దోహదపడతాయని, పర్యావరణ సమతుల్యతను కాపాడేందుకు చెట్లు అత్యంత అవసరమన్నారు. ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటిని పెంచి సంరక్షించాలనే కృతనిశ్చయంతో ముందుకు సాగాలని సూచించారు. పుట్టినరోజులు, వివాహాలు, ఇతర శుభకార్యాల సందర్భంగా మొక్కలు నాటే సంప్రదాయాన్ని అలవాటు చేసుకోవాలని మంత్రి కోరారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ సంధ్యారాణి, ఆర్డీవో సుమ, జడ్పీ సీఈఓ రామ్ రెడ్డి, తహసీల్దార్ ఇక్బాల్, వివిధ శాఖల అధికారులు, మహిళలు, విద్యార్థులు పాల్గొన్నారు.

# పర్యావరణ పరిరక్షణలో భాగస్వాములు అవ్వాలి




- ఎంపీడీవో సురేష్

**తొర్రూరు, విశాలజ్యోతి:** పెద్ద వంగర మండల కేంద్రంలో సర్పంచ్ ముద్దసాని పారిజాత సురేష్ ఆధ్వర్యంలో వన మహోత్సవ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అ తిథిగా పెద్దవంగర ఎంపీడీవో సురేష్ హాజరై మొక్కలు నాటారు. సందర్భంగా వారు మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలన్నారు. మొక్కలు నాటడమే కాక వాటిని సంరక్షించే బాధ్యత ప్రతి ఒక్కరూ తీసుకోవాలని పిలుపునిచ్చారు. మొక్కలు నాటడం ద్వారా స్వచ్ఛమైన గాలి పర్యావరణ సమతుల్యానికి దోహదపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో అగ్రికల్చర్ ఆఫీసర్ స్వామి నాయక్, పంచాయతీ సెక్రెటరీ వెంకన్న టిఏలు సురేష్, యాకన్న, ఫీల్డ్ అసిస్టెంట్లు, గ్రామపంచాయతీ పాలకవర్గ సభ్యులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# గ్రామాలను అనుసంధానం చేస్తూ రహదారుల నిర్మాణం

- ఎంపీ శ్రీమతి డీకే అరుణ
- ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి



**మహబూబ్‌నగర్, విశాలజ్యోతి:** ప్రజల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకొని గ్రామాలను అనుసంధానం చేస్తూ మెరుగైన రహదారులను ఏర్పాటు చేస్తున్నామని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే శ్రీ యెన్నం శ్రీనివాస్ రెడ్డి గారు అన్నారు. మహబూబ్‌నగర్ ఎంపీ శ్రీమతి డీకే అరుణ గారితో కలిసి హన్వాడ మండలంలోని హన్వాడ నుంచి గుడి మల్కాపూర్ వరకు పి ఎం జి ఎస్ వై నిధులు రూ. 3.97 కోట్లతో నిర్మించిన బీటీ రోడ్డును ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి రహదారులు ఎంతో కీలకమని అన్నారు. గ్రామాల మధ్య మెరుగైన రవాణా సౌకర్యం కల్పించడం ద్వారా ప్రజల ప్రయాణ ఇబ్బందులు తొలగడంతో పాటు, రైతులు తమ వ్యవసాయ ఉత్పత్తులను మార్కెట్లకు సులభంగా తరలించుకునే అవకాశం కలుగుతుందని తెలిపారు. హన్వాడ మండలంలోని గ్రామాలను ప్రధాన రహదారులతో అనుసంధానం చేసి రవాణా సౌకర్యాలను మరింత మెరుగుపరచేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. రహదారుల అభివృద్ధితో విద్యార్థులు, రైతులు, ఉద్యోగులు, వ్యాపారులు సహా అన్ని వర్గాల ప్రజలకు ఎంతో ప్రయోజనం కలుగుతుందని పేర్కొన్నారు. ప్రజలకు అవసరమైన మౌలిక వసతులను గుర్తించి దశలవారీగా అభివృద్ధి కార్యక్రమాలను చేపడుతున్నామని, మహబూబ్‌నగర్ నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నామని ఎంపి శ్రీమతి డికె అరుణ గారు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మల్లు నర్సింహ్మారెడ్డి, ముడా చైర్మన్ లక్ష్మణ్ యాదవ్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు సిరాజ్ ఖాద్రీ , డిసిసి ప్రధాన కార్యదర్శి బుద్దారం సుధాకర్ రెడ్డి, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వి.మహేందర్, మండల కార్యనిర్వాహక అధ్యక్షులు చెన్నయ్య, జి.నర్సింహులు, టంకర కృష్ణయ్య యాదవ్, వివిధ విభాగాల అధ్యక్షులు, కార్యదర్శులు, గ్రామ సర్పంచులు తదితరులు పాల్గొన్నారు.


# పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత



- ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి

**పరకాల,విశాలజ్యోతి:** పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి అన్నారు. మంగళవారం పరకాల పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో వన మహోత్సవం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి మొక్కలు నాటి, వన మహోత్సవాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పర్యావరణాన్ని పరిరక్షించడంతో పాటు భవిష్యత్ తరాలకు ఆరోగ్యకరమైన, ఆహ్లాదకరమైన వాతావరణాన్ని అందించేందుకు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని సూచించారు. మొక్కలు నాటడమే కాకుండా వాటి సంరక్షణ బాధ్యతను కూడా తీసుకోవాలని అన్నారు. ప్రతి గ్రామంలో విస్తృతంగా మొక్కలు నాటి, వాటి సంరక్షణపై ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ ఎం. మంజుల, అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది, ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# సీఎంకు, మంత్రులకు మధ్య సయోధ్య లేదు ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్



తెలంగాణలో పాలన ఎంత అస్తవ్యస్థంగా ఉంది.. కేబినెట్‌లోనే ఒకరికొకరి మధ్య సయోధ్య లేదనేది నిన్న ప్రెస్ మీట్ జరిగిన విధానం చూస్తే తెలిసిపోతుందని బీఆర్ఎస్ జనరల్ సెక్రటరీ ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ అన్నారు. తెలంగాణ భవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లా డుతూ.. ముఖ్యమంత్రి డైరెక్టుగా లండన్ నుంచి వచ్చి తెలంగాణ ప్రజల ఆత్మగౌరవం దెబ్బ తిన్నవిషయం మీదనే ప్రెస్ మీట్ పెడితే ముఖ్యమంత్రితో ఉండే కేబినెట్ మంత్రులే మీడియా సమావేశం గురించి ఏ మాత్రం సమాచారం లేకుండా ఉంటున్నరా. అని ప్రశ్నించారు. ఒకటే సచివాలయం. మరి కేబినెట్ సబ్ కమిటీ సమావేశంలో ఉన్నారని చెప్తున్న ఉత్తమ్ కుమార్ రెడ్డి, మల్లు భట్టి విక్రమార్క, మీడియా సమావేశం అయిన తర్వాత 10 నిమిషాలకు ముఖ్యమంత్రి ప్రెస్‌మీట్ పెడుతుంటే కూడా కేబినెట్ సహచర మంత్రులు కూడా ఎవరూ రాని పరిస్థితి. ఇలాంటి పరిస్థితి నేడు తెలంగాణలో ఉన్నది. అంటే ఒక విషయం మీద కేబినెట్‌లోనే సయోధ్య లేదని ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ అన్నారు.

# ఫాస్టాగ్ నుంచే ట్రాఫిక్ చలాన్ల వసూలు హైదరాబాద్ పోలీసుల యోచన

ట్రాఫిక్ నిబంధనలను ఉల్లంఘించే వారి నుంచి జరిమానాలను నేరుగా వారి ఫాస్టాగ్ ఖాతాల నుంచి వసూలు చేసేందుకు హైదరాబాద్ పోలీసులు యోచిస్తున్నారు. ఈ ప్రతిపాదనను పరిశీలిస్తున్నట్లు సైబరాబాద్ ట్రాఫిక్ జాయింట్ కమిషనర్ ఆఫ్ పోలీస్ సున్‌ప్రీత్ సింగ్ వెల్లడించారు. ఈ వినూత్న విధానం అమలుచేసే విషయమై హైదరాబాద్ మెట్రోపాలిటన్ డెవలప్‌మెంట్ అథారిటీ అధికారులతో చర్చిస్తున్నామని, దీనిపై వారి నుంచి అధికారిక స్పందన రావాల్సి ఉందని తెలిపారు. ఇటీవల సొసైటీ ఫర్ సైబరాబాద్ సెక్యూరిటీ కౌన్సిల్ 20వ వార్షికోత్సవం సందర్భంగా నిర్వహించిన ఒక కార్యక్రమంలో సున్‌ప్రీత్ సింగ్ ఈ కీలక వ్యాఖ్యలు చేశారు. “ప్రజలు, భాగస్వామ్యం, సాంకేతికత ద్వారా సురక్షితమైన రహదారుల నిర్మాణం” అనే అంశంపై జరిగిన చర్చా కార్యక్రమంలో ఆయన ప్యానలిస్ట్‌గా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అత్యాధునిక సాంకేతికతను వినియోగించుకుని వివరించారు.

# పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత

- మున్సిపల్ చైర్మన్ తూనం శ్రావణ్ కుమార్




**తొర్రూరు విశాలజ్యోతి:** తొర్రూరు పట్టణ కేంద్రంలోని స్థానిక జడ్పిహెచ్ఎస్ పాఠశాలలో మున్సిపల్ చైర్మన్ శ్రవణ్ కుమార్ ఆధ్వర్యంలో వనమహోత్సవ కార్యక్రమంలో భాగంగా మున్సిపల్ చైర్మన్ తూనం శ్రవణ్ కుమార్ పాఠశాల ఆవరణలో మొక్కలను నాటారు. ఈ సందర్భంగా చైర్మన్ శ్రవణ్ మాట్లాడుతూ వన మహోత్సవం కార్యక్రమాన్ని విజయవంతం చేయడంలో తొర్రూరు మున్సిపాలిటీ ఎప్పుడు ముందుం టుందని పచ్చదనమే పట్టణ అభివృద్ధికి నిజమైన గుర్తింపు అని అన్నారు ప్రజల సంక్షేమం మౌలిక వసతుల అభివృద్ధి పర్యావరణ పరిరక్షణ అనే మూడు ప్రధాన లక్ష్యంతో మున్సిపాలిటీ ముందుకు సాగుతుందని తెలిపారు. ప్రతి ఇంట ఒక మొక్క అనే సందేశంతో ప్రతి కుటుంబం కనీసం ఒక మొక్కను నాటి దానిని సంరక్షించి హరిత తొర్రూరు నిర్మాణంలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. పర్యావరణ పరిరక్షణకు అత్యున్నత ప్రాధాన్యత ఇవ్వాలని, భవిష్యత్ తరాలకు స్వచ్ఛమైన, ఆరోగ్యకరమైన వాతావరణాన్ని అందించాలనే సంకల్పంతో మొక్కలు మాట్లాడడం జరుగుతుందన్నారు.ప్రతి ఒక్కరూ కనీసం ఒక మొక్కలను నాటి వాటిని సంరక్షించుకోవాలన్నారు."ప్రతి ఇంటా ఒక మొక్క -- ప్రతి పౌరుడు ఒక సంరక్షకుడు" అనే సందేశంతో ప్రతి కుటుంబం కనీసం ఒక మొక్కను నాటి దానిని సంరక్షించి హరిత తొర్రూరు నిర్మాణంలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ శ్యాంసుందర్, వైస్ చైర్మన్ సోమ రజిని రాజశేఖర్, పాఠశాల హెచ్ఎం జెల్ల లక్ష్మీనారాయణ,కౌన్సిలర్లు తూర్పాటి రవి, పేర్ల జంపన్న, కిన్నెర కవిత సతీష్, ముద్దసాని సురేష్, కర్నే నాగరాజు, ధారావత్ పద్మ కిషన్ ,వార్డు అధికారులు, మున్సిపల్ సిబ్బంది, ఆర్పీలు తదితరులు పాల్గొన్నారు.

# చెట్ల పెంపకంతో స్వచ్ఛమైన వాతావరణం

- ప్రకాశం స్టేడియంలో మార్నింగ్ వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఘనంగా వనమహోత్సవం



**భద్రాద్రి కొత్తగూడెం(విశాల జ్యోతి):** చెట్ల పెంపకంతో స్వచ్ఛమైన ఆక్సిజన్ లభిస్తుందని పచ్చదనం పరిరక్షణకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా మొక్కలు నాటాలని వాకర్స్ అసోసియేషన్ సభ్యులు పేర్కొన్నారు. కొత్తగూడెం కార్పొరేషన్ పరిధిలోని ప్రకాశం స్టేడియంలో మంగళవారం మార్నింగ్ వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో వనమహోత్సవ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. సందర్భంగా పలువురు వాకర్స్ మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ పచ్చదనం పెంపొందించడం భవిష్యత్ తరాలకు స్వచ్ఛమైన వాతావరణాన్ని అందించాలనే సంకల్పంతో ఈ కార్యక్రమాన్ని చేపట్టడం జరిగిందన్నారు.మొక్కను నాటడం ఒక కార్యక్రమం మాత్రమే కాదని దానిని సంరక్షించడం మన సామాజిక బాధ్యత అన్నారు. పట్టణాల్లో పచ్చదనం పెంపొం దించేందుకు ప్రతి ఒక్కరూ తమ వంతు బాధ్యతగా మొక్కలు నాటి వాటి సంరక్షణకు కృషి చేయాలని పిలుపునిచ్చారు.ప్రస్తుతం పెరుగుతున్న కాలుష్యం వాతావరణ మార్పు లు ఉష్ణోగ్రతల పెరుగుదల వంటి సమస్య లను ఎదుర్కోవాలంటే పెద్ద ఎత్తున మొక్కలు నాటడంతో పాటు వాటిని సంరక్షించడం ఎంతో అవసరమని పేర్కొన్నారు. ప్రతి కుటుంబం ప్రతి విద్యాసంస్థ ప్రతి సంస్థ కనీసం కొన్ని మొక్కలను నాటి వాటి బాధ్యతను తీసుకుంటే పచ్చని ఆరోగ్యకరమైన సమాజాన్ని నిర్మించవచ్చని తెలిపారు.మనం నాటే ప్రతి మొక్క రేపటి తరాలకు మనం అందించే విలువైన బహుమతి అని వారు పేర్కొన్నారు. ప్రకాశం స్టేడియం పరిసరాలను మరింత పచ్చగా ఆహ్లాదకరంగా తీర్చిదిద్దేందుకు వాకర్స్ అసోసియేషన్ నిరంతరం కృషి చేస్తుందని తెలిపారు. అనంతరం వాకర్స్ అసోసియేషన్ సభ్యులు వాకర్స్ పాల్గొని మొక్కల సంరక్షణకు ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు యం.ఎస్. ఫణి, సెక్రటరీ మైనేని మోహన్ రావు, గౌరవ అధ్యక్షులు డాక్టర్ బత్తుల కృష్ణయ్య, ప్రత్యేక ఆహ్వానితులు డాక్టర్ పి.వెం కటేశ్వర్ రావు, ప్రొఫెసర్ యర్నం చిన్న ప్పయ్యతో పాటు పలువురు వాకర్స్ ఉత్సా హంగా పాల్గొని వివిధ రకాల మొక్క లను నాటారు.

# సెక్యూరిటీ కాంట్రాక్టు తెలంగాణ ఏజెన్సీకే ఇవ్వాలి

- టిజివిపి, బి ఎస్ ఎఫ్ నాయకుల డిమాండ్.



**హనుమకొండ, విశాలజ్యోతి:** కాకతీయ యూనివర్సిటీలో సెక్యూరిటీ గార్డుల కాంట్రాక్టును ఆంధ్ర ప్రాంతానికి చెందిన ఏజన్సీకి కాకుండా తెలంగాణ ప్రాంతానికి చెందిన అర్హత కలిగిన ఏజెన్సీకి ఇవ్వాలని టిజివిపి, బి ఎస్ ఎఫ్ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు కాకతీయ యూనివర్సిటీ రిజిస్ట్రార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా టి జి వి పి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మేడ రంజిత్,బి ఎస్ ఎఫ్ ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షుడు కాడపాక రాజేందర్ లు మాట్లాడుతూ... కాకతీయ యూనివర్సిటీ తెలంగాణ ప్రాంతానికి చెందిన ప్రతిష్ఠాత్మక విద్యాసంస్థ అని, ఇక్కడ సెక్యూరిటీ సిబ్బంది నియామకంలో తెలంగాణకు చెందిన అర్హత కలిగిన ఏజెన్సీలకు ప్రాధాన్యత కల్పించాలని కోరారు.తెలంగాణలో అనేక సెక్యూరిటీ ఏజెన్సీలు అర్హతలు, అనుభవం కలిగి ఉన్నప్పటికీ స్థానిక ఏజెన్సీలకు అవకాశం ఇవ్వకుండా ఇతర ప్రాంతానికి చెందిన ఏజెన్సీకి కాంట్రాక్టు అప్పగిస్తే స్థానిక నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు తగ్గే ప్రమాదం ఉందన్నారు. సెక్యూరిటీ కాంట్రాక్టు విషయంలో పారదర్శకంగా, నిబంధనల ప్రకారం టెండర్ ప్రక్రియ నిర్వహించి అర్హత కలిగిన తెలంగాణ ప్రాంత ఏజెన్సీలకు సముచిత అవకాశం కల్పించాలని డిమాండ్ చేశారు.కాంట్రాక్టు వ్యవహారానికి సంబంధించిన పూర్తి వివరాలను అధికారులు వెల్లడించి, ఎటువంటి పక్షపాతం లేకుండా న్యాయబద్ధంగా నిర్ణయం తీసుకోవాలని కోరారు. కాకతీయ యూనివర్సిటీ భద్రతా వ్యవస్థలో తెలంగాణ ప్రాంత యువతకు, స్థానిక ఏజెన్సీలకు అవకాశం కల్పించాలని వారు స్పష్టం చేశారు.అనంతరం యూనివర్సిటీ రిజిస్ట్రార్‌కు వినతిపత్రం అందజేసి సమస్యను పరిశీలించి తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు నాగరాజ్ ప్రభంజన్ తదితరులు పాల్గొన్నారు.

# 15 వేల కోట్ల ఫీజు రీయింబర్స్మెంట్ విడుదల చేయాలి

- ఫీజు బకాయి - బీజేపీ లడాయి' లో గంట రవికుమార్.
- రాష్ట్ర అధ్యక్షుడికి సంఘీభావం.




**హైదరాబాద్, విశాలజ్యోతి:** విద్యార్థుల న్యాయమైన హక్కుల కోసం, ఫీజు రీయింబర్స్మెంట్ బకాయిల విడుదలకు డిమాండ్ చేస్తూ తెలంగాణ బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు ఎన్.రామచందర్ రావు గారు చేపట్టిన 'ఫీజు బకాయి – బీజేపీ లడాయి' 48 గంటల నిరాహార దీక్షలో పాల్గొని సంఘీభావం తెలిపిన బీజేపీ వరంగల్ జిల్లా అధ్యక్షులు గంట రవికుమార్. విద్యార్థి నాయకుడిగా ప్రారంభమై, ఎమ్మెల్సీగా ప్రజాసేవ చేసి, నేడు బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడిగా ఎన్. రామచందర్ రావు గారికి విద్యార్థుల కష్టాలు, సమస్యలపై సంపూర్ణ అవగాహన ఉంది. విద్యార్థుల పక్షాన నిలబడి, రాష్ట్ర ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరికి వ్యతిరేకంగా పోరాడుతున్న వారికి సంపూర్ణ మద్దతు తెలియజేస్తూ ఫీజు రీయింబర్స్మెంట్ బకాయిలు రాక కోర్సులు పూర్తయినా విద్యార్థులకు సర్టిఫికెట్లు చేతికి రావడం లేదు. కాలేజీ ఫీజులు చెల్లించేందుకు పేద విద్యా ర్థుల తల్లులు తమ తాళిబొట్లు సైతం తాకట్టు పెట్టి అప్పులు తెస్తున్నారు. ఇంతకంటే దారుణమైన పరిస్థితి ఇంకేముంటుంది రాహుల్ గాంధీ గారు హైదరాబాద్ వచ్చి యువతకు ఇచ్చిన హామీలన్నీ ఏమయ్యాయి ఉన్నత చదువుల కోసం బ్యాంకుల ద్వారా 5 లక్షల రుణం ఇప్పిస్తామని చెప్పి మోసం చేశారు. విద్యాశాఖ ముఖ్యమంత్రి గారి వద్దే ఉంది. విద్యార్థులను 'క్రిమినల్ వేస్ట్' అంటూ ఆయనే అవమానించడం దుర్మార్గం. రాష్ట్రంలో సరైన విద్యను అందించలేకపోతున్నామని సీఎం స్వయంగా తన వైఫల్యాన్ని ఒప్పుకున్నారు. తక్షణమే రేవంత్ రెడ్డి గారు విద్యాశాఖ బాధ్యతల నుంచి తప్పుకుని రాజీనామా చేయాలి. రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే స్పందించి, పెండింగ్‌లో ఉన్న 15,000 కోట్ల ఫీజు రీయింబర్స్మెంట్ బకాయిలను ఒకే విడతలో విడుదల చేయాలి. నిధులు విడుదల చేసి విద్యార్థులకు న్యాయం జరిగేంత వరకు భారతీయ జనతా పార్టీ అండగా ఉండి పోరాడుతుంది

# బి.సి లు స్వతంత్ర రాజకీయ శక్తిగా ఎదగాలి




- ఆల్ ఇండియా ఒబిసి జాక్ చైర్మన్ సాయిని నరేందర్
- హనుమకొండలో బి.పి మండల్ 108వ జయంతి

**హనుమకొండ, విశాలజ్యోతి:** ఇతర వెనుకబడిన వర్గాలు (ఒబిసి) ల సుదీర్ఘ పోరాటం వల్ల నియమించబడిన మండల్ కమీషన్ నివేదికను బి.సి ల అభివృద్ధికి మేలు చేసే విధంగా అందించిన బి.పి మండల్ (బ్రిందేశ్వర్ ప్రసాద్ మండల్) స్ఫూర్తితో బి.సి లు స్వతంత్ర రాజకీయ శక్తిగా ఎదగాలని ఆల్ ఇండియా ఒబిసి జాక్ చైర్మన్ సాయిని నరేందర్ అన్నారు. హనుమకొండ జిల్లా కేంద్రం అంబేద్కర్ సెంటర్ లో మంగళవారం జరిగిన బి.పి మండల్ 108 వ జయంతికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. బి.సి నాయకుల పోరాటం వల్ల నియమించబడిన బి.పి మండల్ ఎంతో శ్రమకోర్చి నివేదికలో 40 అభివృద్ధి సూచనలు పొందుపరచి 40 ఏండ్లు కావస్తున్నా ఆ అంశాల అమలు పట్ల ఈ దేశ పాలకులు ఉద్దేశపూర్వకంగా నిర్లక్ష్యం చేస్తున్నారని అన్నారు. మండల్ నివేదికలోని అంశాల అమలు కోసం ఐక్య ఉద్యమాలు చేయాల్సిన అవసరముందని అన్నారు. 1980 లో సమర్పించిన బి.పి మండల్ కమీషన్ నివేదికను 1990 లో ఆనాటి ప్రధాని వి.పి సింగ్ అమలు చేయడానికి పార్లమెంటులో ప్రకటించగానే దేశంలోని రాజకీయ పార్టీలన్నీ ఒకటే గగ్గోలు పెట్టాయని ఆనాటి బిజెపి పార్టీ మద్దతు ఉపసంహరించుకుని వి.పి సింగ్ ప్రభుత్వాన్ని కూలదోసిందని, ఆనాటి నుండి నేటి వరకు బిజెపి ప్రభుత్వం బి.సి లకు వ్యతిరేకంగానే పాలన చేస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న న్యాయవాది రాచకొండ ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ కాంగ్రెస్, బిజెపి రెండు బి.సి వ్యతిరేక పార్టీలేనని, అన్నిపార్టీల కన్నాఎక్కువ కాలం దేశాన్ని పాలించిన కాంగ్రెస్, గత 12 ఏండ్లుగా పాలిస్తున్న బిజెపి బి.సి లకు వ్యతిరేక పార్టీలే. కాంగ్రెస్ అధికారంలో ఉన్నపుడు బి.సి జనగణన చేయనప్పుడు ప్రతిపక్షంలో ఉన్న బిజెపి తాము అధికారంలోకి వస్తె ఒబిసి జనగణన చేస్తామని చెప్పి అధికారంలోకి వచ్చిన తర్వాత ఒబిసి జనగణన సాధ్యం కాదని నిస్సిగ్గుగా చెప్పి దేశంలోని 80 కోట్ల ఒబిసి లకు మోసం చేసింది. పూర్వ కాంగ్రెస్ పాలకులు ఒబిసి ల సమస్యలను సరిగా అర్థం చేసుకోకుండా ఒబిసి లకు అన్యాయం చేసిందని, ఇకముందు ఒబిసి లకు న్యాయం చేస్తామని, కుల జనగణన సామాజికన్యాయానికి ఎక్స్ రే లాంటిదని కాంగ్రెస్ అధికారంలోకి వస్తె కుల జనగణన జరిపి రాజకీయ రిజర్వేషన్లు కల్పిస్తామని రాహుల్ గాంధీ ప్రకటించారు. తెలంగాణ ఎన్నికల ముందు పెద్ద బహిరంగ సభ పెట్టి స్థానిక సంస్థల్లో బి.సి లకు 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తామని ప్రకటించి మూడు ఏండ్లు కావస్తున్నా దిక్కులేని స్థితి అని 42 శాతం రిజర్వేషన్లకు ఉన్న రాజ్యాం గపర అడ్డంకులను తొలగించడంలో కాంగ్రెస్ పార్టీ ప్రయత్నం శూన్యమని అన్నారు. ఈ కార్యక్రమంలో బి.సి.ఐ.ఎఫ్ రాష్ట్ర నాయకులు డాక్టర్ కూరపాటి రమేష్, ఐ ఎల్ పి ఎ రాష్ట్ర నాయకులు న్యాయవాది జన్ను పద్మ, అసం ఘటిత కార్మిక సంఘం రాష్ట్ర నాయకులు నలిగింటి చంద్రమౌళి, ఆల్ ఇండియా ఒబిసి జాక్ నాయకులు తాడిశెట్టి క్రాంతి కుమార్, జల్లెల కృష్ణమూర్తి, సద్గుణ, తాడిశెట్టి కార్తీక్, గొల్లపల్లి, వీరస్వామి, రాచకొండ ప్రవీణ్ కుమార్, మడేల్ వీరన్న తదితరులు పాల్గొన్నారు.

# అంతర్‌రాష్ట్ర గంజాయి స్మగ్లర్ అరెస్టు

- సుమారు రూ.1.25 కోట్ల విలువైన 251 కిలోల గంజాయి.
- ఒక ద్విచక్ర వాహనం, రూ.9,000 నగదు
- ఒక సెల్‌ఫోన్ స్వాధీనం
- వివరాలు వెల్లడించిన వరంగల్ పోలీస్ కమిషనర్.



**వరంగల్ క్రైమ్, విశాలజ్యోతి:** వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో యువత మత్తు పదార్థాలకు బానిసలుగా మారకుండా వారి భవిష్యత్తును కాపాడడంతో పాటు, గంజాయి మరియు ఇతర మత్తు పదార్థాల విక్రయాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటూ గంజాయి రహిత సమాజమే లక్ష్యంగా వరంగల్ కమిషనరేట్ పోలీసులు ప్రత్యేక దృష్టి సారించారు.ఇందులో భాగంగా ఈస్ట్ జోన్ డీసీపీ అంకిత్ కుమార్ ఆధ్వర్యంలో దామెర పోలీసులు అంతర్‌రాష్ట్ర గంజాయి స్మగ్లింగ్‌కు పాల్పడుతున్న నిందితుడిని అదుపులోకి తీసుకుని విచారించగా, గంజాయి కొనుగోలు, విక్రయాలకు సంబంధించి కీలక వివరాలు వెలుగులోకి వచ్చాయి.
ముదిగొండ నాగేశ్వర్ రావు, వయస్సు 55 సంవత్సరాలు, పులుకుర్తి గ్రామం, దామెర మండలం, హనుమకొండ జిల్లా. సులభంగా డబ్బు సంపాదించాలనే ఉద్దేశంతో తనకున్న నెట్‌వర్క్ ద్వారా ఒడిశా రాష్ట్రానికి చెందిన రమేష్, సుధాకర్ వద్ద తక్కువ ధరకు గంజాయిని కొనుగోలు చేసి, తెలంగాణ, మహారాష్ట్ర, కర్ణాటక, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలకు చెందిన ఉర్దు, రాందాస్ శేషరావు బీరదార్, అక్లీం, షారుఖ్ ఖాన్, షేక్ అక్బర్, నునావత్ రాజు తదితరుల ద్వారా అధిక ధరకు విక్రయించినట్లు ప్రాథమిక విచారణలో వెల్లడైం ది.నిందితుడు ఇచ్చిన సమాచారంతో పోలీసులు అతని ఇంటి నుంచి సుమారు రూ.1.25 కోట్ల విలువైన 251 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. అదేవిధంగా ఒక ద్విచక్ర వాహనం, రూ.9,000 నగదు, ఒక సెల్‌ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసులో పోలీసులు దర్యాప్తు కొనసాగిస్తున్నారు. నిందితుడు నాగేశ్వర్ రావు నుంచి గంజాయి కొనుగోలు చేసిన ఇతర రాష్ట్రాలకు చెందిన నిందితులను పట్టుకునేందుకు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశారు. మత్తు పదార్థాల అక్రమ రవాణాతో పాటు వాటి వినియోగంపై తెలంగాణ పోలీస్ శాఖ అత్యంత కఠినంగా వ్యవహరిస్తోంది. మత్తు పదార్థాల నియంత్రణకు ప్రజలు కూడా తమ వంతు సహకారం అందించాలని కోరుతున్నాము. ఎవరైనా గంజాయి విక్రయాలకు పాల్పడుతున్నా, వినియోగిస్తున్నా వెంటనే స్థానిక పోలీసులకు సమాచారం అందించాలని ప్రజలకు విజ్ఞప్తి చేస్తున్నాము. గంజాయి స్మగ్లర్‌ను పట్టుకోవడంలో ప్రతిభ కనబరిచిన పరకాల ఏసీపీ సతీష్ బాబు, శాయంపేట సర్కిల్ ఇన్స్పెక్టర్ సుధాకర్ రెడ్డి, ఆత్మకూర్ ఇన్‌స్పెక్టర్ సంతోష్, దామెర ఎస్ఐ వీరభద్రరావు, శాయంపేట ఎస్ఐ పరమేశ్వర్, పరకాల ఎస్ఐ రఘుపతి, ఏఏఓ సల్మాన్ పాషా, దామెర, శాయంపేట పోలీస్ సిబ్బందిని మనస్ఫూర్తిగా అభినందిస్తున్నాను.

# తెలంగాణ రాజ్యాధికార పార్టీలో చేరికలు



**హైదరాబాద్, విశాలజ్యోతి:** సంగారెడ్డి జిల్లా,ఆందోల్ నియోజకవర్గం నుండి పలువురు యువకులు తెలంగాణ రాజ్యాధికార పార్టీలో చేరారు. పార్టీ సిద్ధాంతాలు, బీసీల రాజ్యాధికార లక్ష్యాలు మరియు పార్టీ అధినేత ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న నాయకత్వానికి ఆకర్షితులై వారు పార్టీలో చేరినట్లు నాయకులు తెలిపారు. ఈ సందర్భంగా పార్టీ అధినేత, ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న గారు వారికి పార్టీ కండువా కప్పి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం మల్లన్న గారు మాట్లాడుతూ రాష్ట్రంలో సామాజిక న్యాయం, బీసీలకు రాజ్యాధికారం సాధించడమే పార్టీ ప్రధాన లక్ష్యమని తెలిపారు. యువత రాజకీయాల్లో చైతన్యవంతంగా పాల్గొని సమాజ మార్పుకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఆందోల్ నియోజకవర్గంలో పార్టీ బలోపేతానికి యువత ముందుకు రావడం సంతోషకరమని, రానున్న రోజుల్లో తెలంగాణ రాజ్యాధికార పార్టీని గ్రామ గ్రామానికి తీసుకెళ్లి మరింత బలోపేతం చేస్తామని నాయకులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు శరత్,సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

# వాతావరణ సమతుల్యాన్ని కాపాడదాం



- చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్ డాక్టర్. బీమా నాయక్

**హనుమకొండ విశాలజ్యోతి:** వాతావరణ సమతుల్యాన్ని కాపాడుదాం అని చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్ డాక్టర్. బీమా నాయక్ అన్నారు. ప్రభుత్వ జూనియర్ కళాశాల ( కో- ఎడ్యుకేషన్) హనుమకొండ, వన మహోత్సవం అటవీ శాఖ మరియు ఎన్.ఎస్. ఎస్ సంయుక్త ఆధ్వర్యంలో ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొని మొక్కను నాటి ఈ సందర్భంగా మాట్లాడుతూ వాతావరణ సమతుల్యాన్ని కాపాడినప్పుడే సకాలంలో వర్షాలు పడతాయని ప్రతి ఒక్కరూ ఇంటి వద్ద గాని, బావి దగ్గర గాని, కళాశాలలో గాని, ఇంటి ఇరువైపులా గాని, మొక్కలను నాటినప్పుడు అవి కార్బన్డయాక్సైడ్ తీసుకుని స్వచ్ఛమైన ఆక్సిజన్ ఇస్తుందని అన్నారు. ఏలినీనో ప్రభావం వల్ల భూ వాతావరణ వేడికి సకాలంలో వర్షాలు పడడం లేదని దీనిఅంతటికి కారణం అడవులు నరికి వేయడం వల్లే, వర్షాలు పడడం లేదని, అడవుల్లో ఉండే జంతువులు జనావాసాల్లోకి వస్తున్నాయని వాటికి అడవిలో ఆహారం లేకపోవడం వల్లే ఈరోజు గ్రామాల్లో జంతువులు తిరుగుతున్నాయని అన్నారు.

ఈ కార్యక్రమంలో కళాశాల ఇన్చార్జి ప్రిన్సిపల్ సంధ్యారాణి, అధ్యాపకులు కే.శ్రీధర్, ఎం. సాంబశివయ్య, ఎన్. యాకూబ్, శోభ, కే రేవతి, ఎన్.ఎస్.ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ ఎస్. రాజ్ కుమార్ మరియు అటవీశాఖ హనుమకొండ డిస్టిక్ ఫారెస్ట్ ఆఫీసర్ ముకుంద రెడ్డి, హనుమకొండ ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ టి. శ్రీనివాస్, హనుమకొండ డిప్యూటీ ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ బి. మోహన్, అటవీ శాఖ సిబ్బంది పాల్గొన్నారు

# మంచిచేసే ఇంటి కషాయం

ఆధునిక జీవనశైలి, మారిన ఆహారపు అలవాట్ల వల్ల చాలామంది అనేక ఆరోగ్య సమస్యలను ఎదుర్కొంటున్నారు. వాటిలో యూరిక్ యాసిడ్ సమస్య ఒకటి. ఇది మితిమీరితే కీళ్ల నొప్పులు, వాపులు రావడమే కాకుండా భవిష్యత్తులో గౌట్ వ్యాధికి దారితీసే ప్రమాదముంది. మరి ఈ సమస్య నుంచి ఉపశమనం పొందేందుకు ఇంగ్లిష్ మందుల కంటే మన వంటింట్లోని సహజ మూలికలే అద్భుతంగా పనిచేస్తాయి. ముఖ్యంగా ప్రతిరోజూ మన కూరల్లో వాడే కొత్తిమీర యూరిక్ యాసిడ్ స్థాయిలను తగ్గించడంలో ఒక సంజీవనిలా తోడ్పడుతుంది. దీనితో తయారుచేసే కషాయం యూరిక్ యాసిడ్‌ను ఎలా నివారిస్తుందో తెలుసుకుందాం..

ప్యూరిన్లు ఎకువగా ఉండే ఆహార పదార్థాలను తీసుకున్నప్పుడు రక్తంలో యూరిక్ యాసిడ్ స్థాయిలు వేగంగా పెరిగి కీళ్లలో స్పటికాల రూపంలో చేరి తీవ్రమైన నొప్పులు, వాపులు, గౌట్ సమస్యకు దారితీస్తాయి. అలాంటి సమయంలో కొత్తిమీర లేదా ధనియాల కషాయం యూరిక్ యాసిడ్ స్థాయిలను తగ్గించడంలో ఎంతో ప్రభావవంతంగా పనిచేస్తుంది. కొత్తిమీరలో ఉండే డైయూరిటిక్, యాంటీ ఆక్సిడెంట్ గుణాలు, విటమిన్ సి, కె, ఫ్లేవనాయిడ్లు శరీరంలోని టాక్సిన్లను సమర్థంగా తొలగించి మూత్రపిండాల పనితీరును మెరుగుపరుస్తాయి. కొత్తిమీర కషాయం ఒక సహజమైన డయూరిటిక్ ఏజెంట్‌గా పనిచేసి మూత్రవిసర్జన ప్రమాణాన్ని పెంచుతుంది. తద్వారా రక్తంలో పేరుకు పోయిన అధిక యూరిక్ యాసిడ్ మూత్రం ద్వారా సులభంగా బయటికి పోతుంది. ఇది మూత్రపిండాలపై పడే భారాన్ని తగ్గించి వడపోత సామర్థ్యాన్ని గణనీయంగా మెరుగుపరుస్తుంది. అంతే కాకుండా కీళ్లలో కలిగే మంట, వాపులను తగ్గించడంలో ఇందులోని యాంటీ ఇన్ఫ్లమేటరీ గుణాలు కీలక పాత్ర పోషిస్తాయి.కషాయం తయారు చేయడానికి.. తాజా కొత్తిమీర లేదా ఒక స్పూన్ ధనియాలు



శుభ్రంగా కడిగి ఒక గ్లాస్ నీటిలో వేసి బాగా మరిగించాలి. మరిగిన నీటిని వడకట్టి గోరువెచ్చగా తీసుకోవాలి. ఈ కషాయాన్ని ప్రతిరోజూ ఉదయం పరగడుపున తాగడం వల్ల శరీరానికి గరిష్ట ప్రయోజనాలు చేకూరుతాయి. ఇలా వారానికి 4 నుంచి 5 రోజులు చేయడం వల్ల శరీరంలోని యూరిక్ యాసిడ్ తగ్గుముఖం పడుతుంది. అంతేకాకుండా జీర్ణక్రియ మెరుగవుతుంది. కడుపులో గ్యాస్, ఉబ్బరం సమస్యలను తగ్గిస్తుంది. రక్తంలో చెడు కొలెస్ట్రాల్ స్థాయిలను తగ్గించి గుండె ఆరోగ్యాన్ని కాపాడటంలో ఇది ఎంతగానో సహాయపడుతుంది. డయాబెటిస్ బాధితుల్లో రక్తంలో చకెర స్థాయిలను నియంత్రించడంలో కొత్తిమీరలోని ప్రత్యేక మూలకాలు ఉపయోగపడతాయి. అలాగే చర్మ సమస్యలు ఉన్నవారికి రక్తాన్ని శుభ్రపరిచి సహజమైన కాంతిని, ఆరోగ్యాన్ని అందిస్తుంది. శరీరంలోని విష పదార్థాలను బయటికి పంపి రోగనిరోధకశక్తిని పెంచడానికి తోడ్పడుతుంది. అయితే ఈ కషాయం మంచి హెర్బల్ రెమిడీగా పనిచేసినప్పటికీ ఇది పూర్తిస్థాయి వైద్య చికిత్సకు ప్రత్యామ్నాయం కాదు. బీపీ, షుగర్ మందులు వాడుతున్న వాళ్లు వైద్యుడి సలహా తర్వాతే దీనిని తీసుకోవాలి.

# నూతన బస్‌స్టాండ్ భూ మార్పిడి ప్రక్రియ వేగవంతం చేయండి

- మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డికి వినతి.
- అందజేసిన వరంగల్ ఎంపీ డా. కడియం కావ్య

**హైదరాబాద్, విశాలజ్యోతి:** కాజీపేట నూతన బస్‌స్టాండ్ నిర్మాణానికి అవసరమైన భూమి మార్పిడి ప్రక్రియను వేగవంతం చేయాలని కోరుతూ వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డిగారిని కలిశారు. హైదరాబాద్‌లోని మంత్రి క్వార్టర్స్‌లో ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి వినతిపత్రం అందజేశారు. కాజీపేట సిగ్నల్ జంక్షన్ వద్ద దక్షిణ మధ్య రైల్వేకు చెందిన భూమిని రాష్ట్ర ప్రభుత్వ భూమితో సమాన భూ విలువ ప్రాతిపదికన మార్పిడి చేసేందుకు రైల్వే ప్రతిపాదించిన విషయాన్ని మంత్రి దృష్టికి ఎంపీ తీసుకెళ్లారు. ఈ మేరకు అందుబాటులో ఉన్న ప్రభుత్వ



భూమిని పరిశీలించి, రైల్వేతో ప్రతిపాదిత భూముల మార్పిడికి వినియోగించేలా చర్యలు చేపట్టాలని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి గారిని కోరారు. ప్రభుత్వ భూమి లభ్యత, అనుకూలతను పరిశీలించి నిబంధనల ప్రకారం చర్యలు తీసుకునేలా అధికారులకు ఆదేశాలు ఇవ్వాలని మంత్రిని విజ్ఞప్తి చేశారు. కాజీపేట నూతన బస్‌స్టాండ్ నిర్మాణం పూర్తయితే కాజీపేటతో పాటు వరంగల్ పార్లమెంట్ నియోజకవర్గ ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యాలు అందుబాటులోకి వస్తాయని ఎంపీ డా.కడియం కావ్య తెలిపారు. ఈ ప్రాజెక్టు కోసం రైల్వే, రాష్ట్ర ప్రభుత్వాల మధ్య సమన్వయంతో భూమి మార్పిడి ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేసి, నిర్మాణ పనులకు మార్గం సుగమం చేయాలని కోరారు.

దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న కాజీపేట నూతన బస్‌స్టాండ్ నిర్మాణ ప్రతిపాదనను ముందుకు తీసుకెళ్లేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డిగారిని ఎంపీ డా. కడియం కావ్య కోరారు.

## మీకు ఫ్యాటీ లివర్ సమస్య ఉందాఅయితే ఈ సహజమైన ఫుడ్స్‌ను మీ డైట్‌లో భాగం చేసుకోవాల్సిందే



నేటి ఉరుకులు, పరుగుల జీవనశైలి, అనారోగ్యకరమైన ఆహారపు అలవాట్లు కాలేయంపై తీవ్ర ప్రభావం చూపుతున్నాయి. ఇలాంటి పరిస్థితుల్లో కాలేయాన్ని ఆరోగ్యంగా ఉంచుకోవాలంటే సరైన ఆహారం, జీవనశైలి మార్పులు చాలా ముఖ్యం. కాలేయం మన శరీరంలో చాలా ముఖ్యమైన అవయవం. ఇది శరీరంలో ఉన్న విష పదార్థాల (ౕశీఇఅఅం) ను తొలగించడం, రక్తాన్ని శుభ్రపరచడం, శక్తిని నిల్వ చేయడం వంటి అనేక ముఖ్యమైన విధులను నిర్వర్తిస్తుంది. కాబట్టి కాలేయాన్ని కాపాడుకుంటే మనం ఆరోగ్యంగా ఉంటాం. కాలేయ ఆరోగ్యాన్ని కాపాడే ముఖ్యమైన ఆహారాలు, తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి ఇప్పుడు తెలుసుకుందాం..

**ఆకుకూరలు :** పాలకూర తదితర ఆకుకూరలు కాలేయానికి చాలా మంచివి. ఇవి శరీరంలో ఉన్న విషాలను తొలగించడంలో సహాయపడతాయి. కాబట్టి ఫ్యాటీ లివర్ సమస్య ఉన్న వాళ్లు తరచూ ఆకుకూరలను తమ ఆహారంలో భాగం చేసుకోవాలి.

**వెల్లుల్లి :** వెల్లుల్లిలో ఉండే సహజ పదార్థాలు కాలేయాన్ని శుభ్రపరచడంలో సహాయపడతాయి. కాబట్టి వెల్లుల్లిని క్రమం తప్పకుండా ఆహారంలో భాగం చేసుకోవాలి.

**సిట్రస్ పండ్లు :** నిమ్మ, నారింజ, ఉసిరి వంటి సిట్రస్ జాతి పండ్లలో విటమిన్ జ పుష్కలంగా ఉంటుంది. ఈ విటమిన్ జ కలిగిన పండ్లను తరచూ తీసుకోవడంవల్ల ఉండి కాలేయాన్ని శుభ్రంగా ఉంచుతాయి.

పసుపు : పసుపు సహజ ఔషధం. వాపును తగ్గించి కాలేయ కణాలను రక్షిస్తుంది. కాబట్టి కాలేయ సమస్య ఉన్నవాళ్లు తమ ఆహారంలో తప్పకుండా సిట్రస్ పండ్లను భాగం చేసుకోవాలి.

బీట్‌రూట్ రసం : బీట్‌రూట్ రసం కూడా కాలేయంలో వాపును తగ్గించడంలో సాయపడుతుంది. కాలేయాన్ని శుభ్రపరచడంలో తోడ్పడుతుంది.

టమాటా : టమాటలు కూడా కాలేయ పని తీరును మెరుగుపరుస్తాయి. కాబట్టి కాలేయం ఆరోగ్యం కోసం టమాటలను ఆహారంలో భాగం చేసుకోవాలి.గ్రీన్ టీ : గ్రీన్ టీ కాలేయంలో కొవ్వు పేరుకు పోవడాన్ని తగ్గిస్తుంది. కాబట్టి తరచూ గ్రీన్ టీ తీసుకోవడం ఆరోగ్యానికి మేలు చేస్తుంది.

దానిమ్మ : దానిమ్మ పండు కూడా కాలేయ కణాలను రక్షించి రక్తాన్ని శుద్ధి చేస్తుంది. కాబట్టి కాలేయం ఆరోగ్యం కోసం తరచూ దానిమ్మ పండ్లను తినాలి.

గమనిక

వేయించిన ఆహారాలు, జంక్ ఫుడ్, మద్యం వంటి వాటికి దూరంగా ఉండాలి. రోజూ వ్యాయామం చేయడం,
కంటినిండ నిద్ర పోవడం చాలా ముఖ్యం. ఆరోగ్యకరమైన
ఆహారం, మంచి జీవనశైలి పాటిస్తే కాలేయాన్ని దీర్ఘకాలం ఆరోగ్యంగా ఉంచుకోవచ్చు.

# తరచూ చేతులు వణుకుతున్నాయ అయితే మీకు ఈ సమస్య ఉన్నట్లే అదేమిటంటే

చేతిలో వస్తువులు పట్టుకున్నప్పుడు లేదా ఏదైనా పని చేస్తున్నప్పుడు చేతులు అదుపు తప్పినట్లు వణుకుతున్నాయా ఫోన్‌లో టైప్ చేయడం, కాఫీ కప్పును పట్టుకోవడం, రాయడం వంటి సాధారణ పనులు కూడా ఇబ్బందిగా మారుతున్నాయా దీనిని చాలామంది ఒత్తిడి, ఆందోళన లేదా వయసు పెరగడం వల్ల వచ్చే సహజ సమస్యగా భావిస్తుంటారు. కానీ తరచూ ఇలా జరుగుతుంటే అది ఎసెన్షియల్ ట్రెమర్ అనే నాడీ సంబంధిత పరిస్థితికి సంకేతం అయ్యే అవకాశాలు ఉంటాయి. ఎసెన్షియల్ ట్రెమర్ అంటే శరీరంలోని ఒక భాగం అనియంత్రితంగా, లయబద్ధంగా వణికే నాడీ సంబంధిత సమస్య. ఇది తల, శరీరం, గొంతు వంటి భాగాలను కూడా ప్రభావితం చేయగలిగినప్పటికీ, ఎక్కువగా చేతులు, ముంజేతుల్లో కనిపిస్తుంది. పార్కిన్సన్స్ వ్యాధితో పోలిస్తే ఇది ఎక్కువగా కనిపించే పరిస్థితి అయినప్పటికీ, దీని గురించి చాలామందికి అవగాహన లేదు.

**వణుకు ఎప్పుడు వస్తుంది..**

ఎసెన్షియల్ ట్రెమర్‌ను గుర్తించడంలో ముఖ్యమైన అంశం వణుకు ఎప్పుడు వస్తుందనేదే. పార్కిన్సన్స్ వ్యాధిలో సాధారణంగా చేతులు విశ్రాంతిలో ఉన్నప్పుడు వణుకుతాయి. అయితే ఎసెన్షియల్ ట్రెమర్‌లో చేతులతో పని చేస్తున్నప్పుడు వణుకు ఎక్కువగా కనిపిస్తుంది. ఉదాహరణకు నీళ్ల గ్లాసు అందుకోవడం, టైప్ చేయడం, షూలేస్ కట్టుకోవడం వంటి పనులు చేస్తున్నప్పుడు చేతులు వణకుతాయి. ఇది మొదట ఒక చేతిలో ప్రారంభమైనప్పటికీ, క్రమంగా రెండు చేతులనూ ప్రభావితం చేసే అవకాశం ఉంటుంది. సాధారణంగా ఎసెన్షియల్ ట్రెమర్ వేళ్లలో స్వల్ప వణుకుతో మొదలై, సంవత్సరాల వ్యవధిలో నెమ్మదిగా పెరుగుతుంది. ఫోన్‌లో మాట్లాడుతున్నప్పుడు చేతులు స్వల్పంగా వణకడం, అప్పుడప్పుడు తల అనియంత్రితంగా ఊగడం వంటి లక్షణాలు కూడా కనిపిస్తాయి. శరీర పరిస్థితులు, జీవనశైలి కూడా ఈ వణుకును మరింత పెంచుతాయి.

**ఎప్పుడు కనిపిస్తుంది..**

ఒత్తిడి, ఆందోళన, అలసట, నిద్రలేమి, కెఫీన్ లేదా ఇతర ఉద్దీపక పదార్థాల వినియోగం, తీవ్రమైన వేడి లేదా చలి వంటివి ఎసెన్షియల్ ట్రెమర్‌ను ఎక్కువగా కనిపించేలా చేస్తాయి. ఎసెన్షియల్ ట్రెమర్‌కు అసలు కారణం ఏంటన్నది ఇప్పటికీ పూర్తిగా స్పష్టంగా తెలియదు. అయితే మెదడులోని కదలికలను సమన్వయం చేసే సెరెబెల్లమ్ ప్రాంతంలోని నాడీ సంకేతాల్లో ఏర్పడే అంతరాయం దీనికి కారణమై ఉంటుందని భావిస్తున్నారు. ఈ నాడీ మార్గాల్లో విద్యుత్ సంకేతాలు సక్రమంగా పనిచేయకపోతే పునరావృతమయ్యే లయబద్ధమైన వణుకు ఏర్పడుతుంది. ఈ సమస్యలో జన్యుపరమైన ప్రభావం కూడా ముఖ్యమైనదిగా చెబుతున్నారు. సుమారు సగం కేసులు కుటుంబాల్లో కనిపిస్తాయి. అందుకే దీనిని ఫ్యామిలియల్ ట్రెమర్ అని కూడా పిలుస్తారు. తల్లిదండ్రుల్లో ఒకరికి దీనికి సంబంధించిన జన్యు ప్రభావం ఉంటే, పిల్లలకు కూడా వచ్చే అవకాశం ఉంటుంది. అయితే ఒకే కుటుంబంలో ఉన్నవారిలో కూడా ఈ సమస్య మొదలయ్యే వయసు, లక్షణాల తీవ్రత వేర్వేరుగా ఉంటాయి.

**ప్రత్యేక పరీక్షలు ఉండవు..**

ఎసెన్షియల్ ట్రెమర్‌ను నిర్ధారించేందుకు ప్రత్యేకమైన రక్త పరీక్ష లేదా మెదడు స్కాన్ ఉండదు. వైద్యులు వ్యక్తి కదలికలను పరిశీలించడం, కుటుంబ ఆరోగ్య చరిత్రను తెలుసుకోవడం, అవసరమైన సాధారణ పరీక్షలు నిర్వహించడం ద్వారా ఇతర కారణాలను తొలగిస్తారు. థైరాయిడ్ సమస్యలు లేదా కొన్ని మందుల దుష్ప్రభావాల వల్ల వణుకు వస్తుందా అనే విషయాన్ని కూడా పరిశీలిస్తారు. తేలికపాటి ఎసెన్షియల్ ట్రెమర్ ఉన్న ప్రతి ఒక్కరికీ తీవ్రమైన వైద్య చికిత్స అవసరం ఉండదు. పరిస్థితిని బట్టి జీవనశైలిలో కొన్ని మార్పులు చేయడం, అవసరమైతే మందులు ఉపయోగించడం ద్వారా వణుకును నియంత్రించవచ్చు. బీటా-బ్లాకర్స్ వంటి మందులు వణుకు తీవ్రతను తగ్గించడంలో సహాయపడతాయి. అయితే ఇవి సమస్యను పూర్తిగా నయం చేయవు.

**ఆధునిక చికిత్సా విధానాలు..**

మందులతో కూడా వణుకు అదుపులోకి రాని తీవ్రమైన సందర్భాల్లో ఆధునిక చికిత్సా విధానాలు అందుబాటులో ఉన్నాయి. బొటులినమ్ టాక్సిన్ ఇంజెక్షన్లు, డీప్ బ్రెయిన్ స్టిమ్యులేషన్ (ఊడీూ), ఫోకస్డ్ అల్ట్రాసౌండ్ వంటి చికిత్సలను పరిస్థితిని బట్టి వైద్యులు సూచిస్తారు. ఫోకస్డ్ అల్ట్రాసౌండ్‌లో మెదడులో వణుకుకు కారణమయ్యే నిర్దిష్ట ప్రాంతాన్ని లక్ష్యంగా చేసుకుని ధ్వని తరంగాలను ఉపయోగిస్తారు. ఎసెన్షియల్ ట్రెమర్ ప్రాణాంతకమైన పరిస్థితి కాదు. సరైన సమయంలో సమస్యను గుర్తించి, అవసరమైన చికిత్స తీసుకోవడంతో పాటు రోజువారీ పనుల్లో తగిన మార్పులు చేసుకుంటే చాలామంది సాధారణ జీవనాన్ని కొనసాగిస్తారు.

"VISHALA JYOOTHI" vide PRGI Registration No. "TGBIL/25/A0946" Printed by Published by DEVENDAR KUNTA on behalf of DEVENDAR KUNTA, printed atHAMARA WARANGAL PRINTERS AND GRAPHICS, H.NO: 25-8-182,BABUJI NAGAR, KAZIPET, WARANGAL, TELANGANA - 506003. and published at H.NO. 4-123/1,KUNTA WADA,RAIPARTHY, WARANGAL, TELANGANA - 506314. Editor DEVENDAR KUNTA, Cell : 9440711117.